ఉచిత ఇసుక పేరుతో దోపిడీ

- ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు అమ్ముకుంటున్న తమ్ముళ్లు
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు
- కోర్టు ఆదేశాలు బేఖాతర్


చోడవరం క్వారీ

పెనమలూరు: చోడవరం ఇసుక క్వారీలో ఉచిత ఇసుక పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకులు దోపిడీకి తెరతీశారు. బహిరంగ మార్కెట్‌లో ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోయి పోటాపోటీగా కృష్ణానదిలో యంత్రాలతో అడ్డగోలుగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. చోడవరంలో ఇసుక తవ్వకాలపై గతంలో సుప్రీంకోర్టు అక్షింతలు వేసినా అధికారుల వైఖరిలో మార్పురాలేదు. చోడవరం ఇసుక క్వారీకి పర్యావరణ అనుమతులతో పాటు ఇతర అనుమతులు లేవని జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఇచ్చిన నివేదిక బుట్టదాఖలైంది. వివరాల్లోకి వెళితే చోడవరం ఇసుక క్వారీలో మరలా ఇసుక తవ్వకాలు గురువారం నుంచి ప్రారంభించారు. దాదాపు 150 ట్రాక్టర్లతో ఇసుక మాఫియా రంగంలోకి దిగారు. టీడీపీ నేతలు ర్యాంపునకు(దారి) రూ.200, లోడింగ్‌కు రూ.900 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. ఇక ఇసుక ట్రాక్టర్ బహిరంగా మార్కెట్‌లోకి వెళ్లిన తరువాత రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. టీడీపీ నేతలకు మాత్రం ఉచిత ఇసుక లభిస్తున్నా.. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఇసుక ధర మంటలు రేపుతుంది. ఉచిత ఇసుకపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రకటనలకు, ఇక్కడ జరుగుతున్న తంతుకు సంబంధం లేకపోవటంతో గృహాల నిర్మాణం చేసుకునే యజమానులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

అనుమతులు లేకున్నా తవ్వకాలు

గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు చోడవరం క్వారీలో అమలు చేయటం లేదు.


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ఇసుక తవ్వకాలపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసిన అధికారులు గతేడాది జూలైలో నివేదిక ఇచ్చారు. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర అనుమతులు లేవని తేల్చారు. జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఫిర్యాదుతో పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఇప్పుడు నివేదిక బుట్టదాఖలు అవ్వగా, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు.

దాడులు చేసినా కేసు లేదు

చోడవరం క్వారీలో టీడీపీ నేతలు ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తితో పాటు ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తిపై కూడా గత మూడు రోజుల క్రితం దాడి చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఈ ఫిర్యాదులను కూడా బుట్టదాఖలు చేశారు. గ్రామంలో పెద్ద మనుషుల ముసుగులో బలవంతపు రాజీలు చేశారని సమాచారం.

గ్రామాల్లో అలజడి

ఇసుక ట్రాక్టర్లు పగలు, రాత్రి తేడా లేకుండా గ్రామాల్లో రహదారులపై వేగంగా వెళ్లటంతో గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో వెళ్లటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. గ్రామాల్లో రహదారులు గుంతలమయంగా ఉండగా ఇసుక ట్రాక్టర్ల వలన భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. ఇసుక అక్రమంగా తరలించడంపై ఒక్క అధికారి కూడా స్పందించక పోవటంతో కోర్టు ధిక్కారం కేసు వేస్తామని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

కందలంపాడులో భూ రీ సర్వే గ్రామసభ

కంకిపాడు: భూ సమస్యలను పరిష్కరించాలని కందలంపాడు సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు కోరారు. భూ రీ సర్వేపై కందలంపాడులో గురువారం గ్రామసభ నిర్వహించారు. సభలో భూ సమస్య ఎదుర్కొంటున్న రైతులు నాలుగు అంశాలపై నాలుగు అర్జీలు సమర్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్వేయరు భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి యూటీఎఫ్ జిల్లా మహాసభలు

గన్నవరం: స్థానిక సీఎల్ రాయుడు రోటరీ ఆడిటోరియంలో ఈ నెల 9, 10 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృష్ణా జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు స్వర్ణోత్సవాల సావనీర్-2024 ఆవిష్కరణ, విద్యా సదస్సు, పదవీ విరమణ చేసిన సంఘ నాయకులకు సన్మాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 10వ తేదీన కృష్ణాజిల్లా ఉద్యమ చరిత్రపై సదస్సు, నివేదికలు, తీర్మానాలపై చర్చ, ఆమోదం, నూతన కమిటీ ఎన్నిక చేపడతామని తెలిపారు. జిల్లాలోని యూటీఎఫ్ సంఘ నేతలు, సభ్యులు, ఉపాధ్యాయులు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పాతపాడులో కల్వర్టుల నిర్మాణం



పాతపాడు(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.4.80 లక్షలతో ఐదు కల్వర్టులు నిర్మిస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ కళ్యాణి తెలిపారు. పాతపాడు గ్రామంలో ఒకటి, వెంకటాపురంలో మూడు, అప్పారావుపేటలో ఒకటి నిర్మిస్తున్నామన్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామాల్లోకి వెళ్లేందుకు వీలుగా పంచాయతీ తీర్మానాలకు అనుగుణంగా కల్వర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు వెంకటాపురం గ్రామంలో రూ.4.80 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం జరుగుతుందన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరులో మహిళపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు చిన్నగుడి సెంటర్‌లో తోట అయ్యప్పస్వామి భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో గత కొద్ది సంవత్సరాలుగా అయ్యప్పస్వామి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా బుధవారం రాత్రి అయ్యప్పస్వామి భార్యపై వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ విచక్షణారహితగా దాడి చేసి గాయపరిచింది. ఆమె నుంచి తనకు, తన పిల్లలకు ప్రాణ హాని ఉందని అయ్యప్పస్వామి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు



పెనమలూరు: కానూరు ఆటోనగర్‌లో లారీ డ్రైవర్ అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ సిద్దిపేట మండలం గద్వేల్ గ్రామానికి చెందిన బీడ ఎల్లయ్య లారీ డ్రైవర్‌గా పని చేస్తాడు. అతను అక్టోబర్ 26న మేడ్చల్‌లో విత్తనాల లోడ్‌తో గుంటూరుకు వచ్చాడు. గుంటూరులో సరుకు అన్‌లోడ్ చేసిన తరువాత కానూరు ఆటోనగర్‌లో 27న లారీ రిపేర్‌కు వచ్చాడు. డ్రైవర్ ఎల్లయ్యతో పాటు సహ డ్రైవర్ కృష్ణపాల్ కూడా ఉన్నాడు. ఆటోనగర్‌లో 30వ తేదీ అతను భోజనం చేసి వస్తానని మెకానిక్ షెడ్డు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సహ డ్రైవర్ ఈ సమాచారం కుటుంబ సభ్యులకు తెలపటంతో ఎల్లయ్య కుమారుడు ప్రశాంత్, బంధువులు వచ్చి కానూరులో ఎల్లయ్య కోసం వెతికారు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అతని ఆచూకీ తెలియకపోవటంతో ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఉంగుటూరు: బొకినాల గ్రామంలో మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఉంగుటూరు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్యం అక్రమంగా తరలిస్తున్నాడన్న సమాచారంతో పెరుమాళ్ల రమేష్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 10 క్వార్టర్ మద్యం సీసాలు లభించాయి. అనంతరం అతడిని స్టేషన్‌కు తరలించి ఎస్ఐ గోవిందు కేసు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం చట్ట విరుద్ధమని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గురువారం భక్తిశ్రద్ధలతో స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక మాట్లాడుతూ డిసెంబర్ 2వ తేదీ వరకు ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ నెల 11న రెండో సోమవారం, 12న శుద్ధ ఏకాదశి, 13న క్షీరాబ్ది ద్వాదశి, 15న కార్తిక పౌర్ణమి, 18న కార్తిక 3వ సోమవారం, 25న 4వ సోమవారం, 26న బహుళ ఏకాదశి, 29న మాస శివరాత్రి సందర్భంగా అన్నాభిషేకం, నవగ్రహ మహామృత్యుంజయ సహిత రుద్రహోమం, డిసెంబరు 2న పోలి పాడ్యమి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం దోబీ కాలనీలో నివాసం ఉంటున్న బెజవాడ బాబూరావు(42) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. అతనికి భార్య జోజిమ్మ, ఇద్దరు కుమారులున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బొంతు సాంబిరెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య, దండు సుబ్రహ్మణ్యంరాజు, రమేష్, దొప్పల సింహాచలం తదితరులు బాబూరావుపార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దాతలు

కంకిపాడు: పట్టణంలోని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల, పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ ప్రారంభించారు. పిన్నమనేని సిద్ధార్థ కళాశాల ప్రొఫెసర్ కల్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ జాస్మిన్ సుల్తానా రక్తదానంపై అవగాహన కల్పించారు. అపోహలు విడనాడాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ.. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వారు తమ జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చని అన్నారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ ఎండీ నూర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కె.శేఖర్‌బాబు, ఎన్‌సీసీ అధికారి పి.శ్రీరామ్‌తేజ, అధ్యాపకులు ఎంఎల్ఎస్ కుమారి, ఆర్వీ శివరావు పర్యవేక్షించారు.

యాజమాన్య పద్ధతులతో పాడి పోషణ లాభసాటి


సర్టిఫికెట్ అందజేస్తున్న చలసాని, కిశోర్

గన్నవరం: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పాడి పోషణ లాభసాటిగా మార్చుకోవచ్చని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద శిక్షణ పొందిన పాడి రైతులకు గురువారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్. కిశోర్‌తో కలిసి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ... పాడి పోషణలో శిక్షణ పొందేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ రంగంలో యువత మెలకువలు నేర్చుకోవడం ద్వారా పాడి పోషణలో మంచి లాభాలను పొందవచ్చని తెలిపారు. దీనివల్ల పాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ సీహెచ్ వెంకటశేషయ్య, డాక్టర్ డి.నరేంద్రనాథ్, డాక్టర్ ఎం.శ్రీవాణి, డాక్టర్ పి.ఆశాలత. విజయ డెయిరీ హనుమాన్‌జంక్షన్ మేనేజర్ మాగంటి హరి, ఏడీ ప్రసాద్ లింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నైపుణ్య గణన


సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ స్వర్ణలత


గన్నవరంలో శిక్షణ తరగతికి హాజరైన సచివాలయ సిబ్బంది

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నైపుణ్య గణన చేపట్టాలని ఎంపీడీఓ టి. స్వర్ణలత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం నైపుణ్య గణనను చేపట్టనుందన్నారు. నైపుణ్య గణనలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబీకులు విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, నైపుణ్యాలకు సంబంధించి 40 రకాల ప్రశ్నలకు సమాచారం సేకరించాలని తెలిపారు. నైపుణ్య గణనలో 15 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఇంటింటికీ సర్వే పూర్తయ్యాక కంపెనీలు, పరిశ్రమలు ఎలాంటి నైపుణ్యాలు కోరుకుంటున్నాయో గుర్తించడం జరుగుతుందన్నారు. వారి అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యా శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈఓపీఆర్డీ టి.భారతి, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బీఎస్ఆర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తాడిగడప చిన్న వంతెన

- అదుపు తప్పితే నేరుగా బందరు కాలువలోకే..
- భద్రత ఏర్పాట్లు చేయాలని వినతి


ప్రమాదకరంగా ఉన్న తాడిగడప చిన్నవంతెన

పెనమలూరు: తాడిగడప చిన్న వంతెన వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. ఈ వంతెనకు రైలింగ్, రిటైనింగ్ వాల్ లేక పోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే తాడిగడప గ్రామంలోకి బందరు కాలువ దాటి వెళ్లాలంటే గతంలో బ్రిటీష్‌కాలం నాటి వంతెన ఉంది. గ్రామస్తులు చాలా సంవత్సరాల పాటు ఈ వంతెన పైనే రాకపోకలు సాగించారు. బస్సులు, పంటలు తరలించే లారీలు, ఇతర వాహనాలు ఈ వంతెన పై నుంచే వెళ్లేవి. అయితే వంతెన చాలా ఇరుకుగా ఉండటం, దీనిని నిర్మించి చాలా కాలం కావటంతో గత 12 సంవత్సరాల క్రితం నూతన వంతెన బందరు కాలువపై నిర్మించారు. ఈ వంతెన పై భారీ వాహనాలు ప్రసుత్తం రావటం లేదు.

అధికారులు స్పందించాలి..

ప్రస్తుతం చిన్న వంతెన పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. చిన్న వంతెన పై నుంచి ఇంకా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. పైగా ఇటీవల చిన్న వంతెన అప్రోచ్ సిమెంట్ రోడ్డు కూడా వేశారు. కాలువ కట్ట ప్రజలకు వంతెన చాలా ఉపయోగపడుతుంది. కొత్త వంతెన ఉన్నా చాలా మంది చిన్న వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వంతెన అప్రోచ్‌లకు రిటైనింగ్ వాల్‌కాని, రైలింగ్ కానీ లేవు. వంతెన మీదుగా వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పితే నేరుగా 50 అడుగుల లోతులో ఉన్న బందరు కాలువలో పడి గల్లంతయ్యే ప్రమాదం ఉంది. రాత్రి సమయాల్లో ఇక్కడ వీధి దీపాలు లేక పోవటంతో వంతెనపై ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంది. చిన్న పిల్లలు, వృద్ధులు వంతెనపై ప్రయాణం భద్రత లేకుండా ఉంది. వంతెన వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరినా చర్యలు లేవు. ప్రమాదాలు జరగక ముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన వద్ద భద్రత ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం


ఉప్పలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది


కానూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


ముస్తాబాదలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

కంకిపాడు: క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో యూనివర్సల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంపై గురువారం అవగాహన ర్యాలీని ఉప్పలూరులో నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ.. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వ్యాధి దరి చేరకుండా ఉంటుందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, శారీరక శుభ్రత, వ్యాయామం చేయాలని చెప్పారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం చేయించుకోవాలని లేనిపక్షంలో ప్రాణాపాయం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధా ప్రసుజా, ఎంపీహెచ్‌ఈఓలు కృష్ణారావు, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కానూరులో అవగాహన ర్యాలీ

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని సూచిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్‌కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆహారపు అలవాట్లపై జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులు సూచించారు. సిగరెట్లు, గుట్కాలు, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. నాణ్యమైన ఆహారం మాత్రమే తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్ లక్షణాలు ముందుగా గుర్తించగలిగితే వ్యాధి నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాదలో ర్యాలీ

గన్నవరంరూరల్: క్యాన్సర్ పరీక్షలు ప్రభుత్వం అందరికీ ఉచితంగా నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి పి.శ్రీహర్ష చెప్పారు. మండలంలోని ముస్తాబాదలో క్యాన్సర్‌పై విజయం, స్క్రీనింగ్‌తో సాధ్యం అంటూ గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఇంటి వద్దనే క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఆయుష్ వైద్యులు పి.శ్రీధర్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీ రంగాకు నివాళి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, సుదీర్ఘ కాలం భారత పార్లమెంట్ సభ్యుడిగా చేసిన ఎన్జీ రంగాను నేటి తరం నాయకులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆచార్య ఎన్జీ.రంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోగినేని ధనశేఖర్ చెప్పారు. ఎన్జీ రంగా జయంతి వేడుకలను గాయత్రీనగర్ చైతన్య స్కూల్ రోడ్డులో వినయ్ అపార్ట్‌మెంట్ వద్ద గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లక్ష్మీ ఫౌండేషన్ హాస్పటల్ వైద్యులు బీపీ, షుగరు, కంటి పరీక్షలను నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు మైనేని సంపత్, కె.దుర్గాప్రసాద్, వి.కాశీకృష్ణ, కె.ప్రసాద్, బి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన కానుమోలు విద్యార్థులతో హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెట్‌బాల్ పోటీలకు బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎస్. పద్మజ గురువారం తెలిపారు. కానుమోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఇటీవల జరిగిన అండర్ - 14, 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, వాలీబాల్ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఎంపికయ్యారన్నారు. బాలికల అండర్-14 బేస్‌బాల్ జట్టుకు కె.ప్రభుజ్యోతి, బాలుర జట్టుకు డి.శ్రీవర్ధన్ ఎంపిక కాగా, బాలికల అండర్-17 జట్టుకు ఆర్.పావని, ఎస్.నీరజ, బాలుర అండర్-17 జట్టుకు బి.అంజి ఎంపికైనట్లు హెచ్ఎం పద్మజ చెప్పారు. సాఫ్ట్‌బాల్ అండర్-14 విభాగంలో బాలికల జట్టుకు వై.శ్రావణి, బాలుర జట్టుకు వై.అవినాష్ బాబు ఎంపిక కాగా, వాలీబాల్ అండర్-14 విభాగంలో బాలుర జట్టుకు ధనుష్ ఎంపికయ్యాడన్నారు. త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, వ్యాయామోపాధ్యాయుడు బీఎస్ రామచంద్రుడు, మాజీ సర్పంచ్ చింతల వెంకటశివ అప్పారావు, దన్నె దుర్గారావు అభినందనలు తెలిపారు.

వ్యాధిపీడితులకు మెరుగైన సేవలు


సూపరింటెండెంట్ డాక్టర్ వేంకటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతిరోగికి నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి చేద్దామని తనను కలిసిన వైద్య ఉద్యోగులతో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ వేంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఏ వేంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌లను గురువారం ఏపీహంస అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి సత్కరించారు. వారిని కలిసిన వారిలో ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్, సిటీ అధ్యక్షుడు వినుకొల్లు రామకృష్ణ, నూర్జహాన్, అరుణ, విమల రమణ, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అన్నదానం

గన్నవరంరూరల్: మండలంలోని బీబీ గూడెం గ్రామంలో మాలధారణ భక్తులందరికీ శుక్రవారం నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకూ నిరంతరం అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు, రాజేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములు, భవానీలు, శివస్వాములకు, గోవింద మాలధారణ భక్తులకు అన్నదానం చేస్తున్నామన్నారు.